క్లుప్తంగా

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించిన డీఐజీ



ద్రాక్షారామ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఐజీ శివరామ్

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ డీఐజీ బి.శివరామ్ మంగళవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ భూముల ధరలను సవరణ చేస్తూ రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద నోటీసు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనిపై ప్రజల నుంచి ఏమైనా అభ్యంతరాలు వచ్చాయా అని పరిశీలిస్తున్నామన్నారు. కార్యాలయంలో రికార్డులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ ఆర్ఎస్ రాణి, సిబ్బంది పాల్గొన్నారు.

దేవులపల్లికి ప్రతిభా పురస్కారం



అభిరామ్‌ను సత్కరిస్తున్న జేసీ నిశాంతి

రామచంద్రపురం రూరల్: జాతీయ వినియోగదారుల దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని ద్రాక్షారామకు చెందిన దేవులపల్లి శ్రీకృష్ణ అభిరామ్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి చేతుల మీదుగా ప్రతిభా పురస్కారం అందజేసి సత్కరించారు. ఫోరం తరఫున అభిరామ్ చేస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ ఉదయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, వికలాంగులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధులు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేసిన దృశ్యం

కె.గంగవరం: మండలంలోని పాణింగపల్లిలో మంగళవారం పల్లి శేషారావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు వృద్ధులు, వికలాంగులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. దీంతో పాటు పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఏటా వృద్ధులకు, వికలాంగులకు దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేయడం ఆనవాయితీగా జరుగుతుందని ఈ ఏడాది కూడా పంపిణీ చేశామన్నారు. లయన్స్ క్లబ్ లియో అధ్యక్షుడు భానుప్రసాద్ కూడా పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులను అందించారు. పాస్టర్ ఆనంద్‌కుమార్, అచ్యుతరామారావు, శాంతికుమారి, మణికుమారి, వెన్నెల, పాస్టర్ ప్రసాద్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీలింగ్ భూమిని నిరుపేదలకు పంచాలి

రామచంద్రపురం రూరల్: మండలంలోని కందులపాలెంలో ఉన్న మూడు ఎకరాల సీలింగ్ భూమిని దళిత, నిరుపేద వర్గాలకు పంచాలని కోరుతూ అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం మంగళవారం తహసీల్దార్ ఎం.సావిత్రికి వినతిపత్రం అందజేశారు.

క్రిస్టియన్ కమ్యూనిటీ భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట: పట్టణంలోని ఏడో వార్డులో ప్రభుత్వం నిర్మించిన క్రిస్టియన్ కమ్యూనిటీ హాలును మంగళవారం ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ 2018లో ఈ భవన నిర్మాణానికి మైనారిటీ వెల్ఫేర్ శాఖ ద్వారా రూ.కోటి నిధులు మంజూరైతే, మండపేట మున్సిపాలిటీ నుంచి మరో రూ 38.20 లక్షలు కేటాయించి భవనం నిర్మాణానికి సహకరించామన్నారు. క్రిస్మస్ ముందు రోజున క్రిస్టియన్ కమ్యూనిటీ హాలును ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రిస్టియన్లకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణంలోని వివిధ చర్చిల పాస్టర్లు, మున్సిపల్ అధికారులు, క్రిస్టియన్లు పాల్గొన్నారు.

కాలిబాటలు.. దిగుబడికు రాచబాటలు

- ముమ్మరంగా రబీ వరిసాగు పనులు
- నెలాఖరుకు పూర్తి చేయాలంటున్న వ్యవసాయ శాఖ

రాయవరం: ఖరీఫ్ పనులు ముగిసి, రబీ పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. రబీ సాగు పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ సూచిస్తోంది. రబీ వరి సాగును అధికంగా వెదజల్లు విధానంలో చేపట్టాలని వ్యవసాయశాఖ రైతులకు సూచిస్తుండడంతో వారు కూడా వెదజల్లు సాగుకే ప్రాధాన్యం ఇస్తున్నారు. వరినాట్లు వేసే సమయంలో రైతులు కాలిబాటలు వేయడం వల్ల చీడపీడల నివారణ సాధ్యమవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

అధిక దిగుబడులకు అవకాశం

వరిసాగు చేసిన రైతులు పొలంలో కాలిబాటలు వేయడం ద్వారా పంట చేలకు గాలి, వెలుతురు సమృద్ధిగా అందుతాయి. పైరు ఆరోగ్యవంతంగా పెరుగుతుంది. గాలి సమృద్ధిగా అందడం వల్ల నీటిలో పెరిగే వరి మొక్కలు ఆక్సిజన్ తీసుకునేందుకు పెద్దగా శక్తిని ఖర్చు చేయాల్సిన అవసరం ఉండదు. తుఫానులు, భారీ వర్షాల వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనప్పుడు పంట చేలల్లోని మొక్కల్లో కిరణజన్య సంయోగ క్రియ సమర్థవంతంగా జరిగి దిగుబడులు పెరుగుతాయి. కాలిబాటలు వేసిన పొలంలో రైతులు సులభంగా పురుగు మందులు, కలుపు మందులు పిచికారీ చేసుకోవచ్చు. ఎరువులను సులభంగా వేసుకోవచ్చు. కాలి బాటలు వేస్తే తరచూ పొలం మధ్యలో తిరిగి పంటను పరిశీలించే అవకాశం ఉంటుంది. అలాగే ఎలుకల వల్ల జరుగుతున్న నష్టాన్ని ఎప్పటికప్పుడు గమనించవచ్చు. పొలంలో నీటి పరిస్థితిపై ఒక అవగాహనకు వచ్చేందుకు వీలుంటుంది. పైరులో చీడపీడల ఉనికిని, ఉధృతిని అతి సమీపం నుంచి గమనించి తదనుగుణంగా సకాలంలో సస్యరక్షణ చేపట్టవచ్చు. కాలిబాటలు వేయడం వల్ల గాలి ప్రసరించి దోమ ఉధృతి తగ్గుతుంది. వరిలో విత్తనాలు వెదజల్లే ముందుకు ఇసుక బస్తాలను మూటలుగా కట్టి ప్రతి రెండు మీటర్లకు కాలిబాటలను ఏర్పాటు చేసుకోవాలి. ఇలా ఏర్పాటు చేసిన కాలిబాటల వల్ల మురుగు నీటిని తొలగించడంతో పాటు అవసరమైనప్పుడు పంట పొలానికి నీరు పెట్టుకోవడానికి బోదెలుగా వినియోగించవచ్చు.



పంట పొలంలో కాలిబాటలు వేస్తున్న కౌలు రైతు

కాలిబాటలు వేయండిలా

కాలిబాటలు వేసుకునే సమయంలో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాల్సిన అవసరం ఉంది. పొలంలో ప్రతి రెండు మీటర్లకు ఒక కాలిబాట చొప్పున 20 సెంటీమీటర్ల వెడల్పులో వేస్తే మంచి ప్రయోజనం ఉంటుంది. 6-7 మీటర్లకు ఒక కాలిబాట వేయడం వలన పెద్దగా ప్రయోజనం ఉండదు. కాలిబాట వేయాల్సిన చోట ముందుగా మార్క్ చేసుకుని గట్లకు రెండు వైపులా తాళ్లు కట్టి మార్క్ చేసిన చోట ఉన్న మొక్కలు తీసేస్తే అది కాలిబాట అవుతుంది. వెదజల్లే పద్ధతిలో కూడా పైరు ఎదుగుతున్న సమయంలో 15-20 రోజుల మధ్యలో 20 సెంటీమీటర్ల వెడల్పులో వరి మొక్కలను తొలగించి కాలిబాటలు వేసుకోవచ్చు.

పలు ప్రయోజనాలు



కాలిబాటలు వేయడం వలన వరి దుబ్బులకు గాలి బాగా సోకడానికి అవకాశం ఉంటుంది. దీని వలన తెగుళ్లు, పురుగుల ఉధృతి తగ్గుతుంది. అదేవిధంగా రైతు ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయడానికి సౌలభ్యంగా ఉంటుంది. రైతుల్లో అవగాహన పెరిగి కాలిబాటలకు ప్రాధాన్యమిస్తున్నారు.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

క్లస్టర్ పరిధిలో

క్లస్టర్ పరిధిలోని రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల పరిధిలో 1.01 లక్షల ఎకరాల్లో రబీ వరిసాగు చేపడుతున్నారు. ఇప్పటి వరకూ 10 వేల ఎకరాల్లో రబీ వరినాట్లు వేశారు. ఇంచుమించుగా 10 వేల ఎకరాల్లో వెదజల్లు విధానానికి రైతులు ప్రాధాన్యం ఇచ్చారు. ఈ నెలాఖరుకు శత శాతం వరినాట్లు వేయాలనేది వ్యవసాయ శాఖ లక్ష్యంగా ఉంది. వెదజల్లు విధానంలో సాగు చేస్తే సాగు లక్ష్యాన్ని చేరుకునే అవకాశముంది.

27న విద్యుత్ చార్జీల బాదుడుపై నిరసన



పిల్లి సూర్యప్రకాశ్

రామచంద్రపురం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు కూటమి ప్రభుత్వం కరెంటు చార్జీల బాదుడుపై వైఎస్సార్ సీపీ పోరు బాట కార్యక్రమంలో ఈనెల 27న నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నియోకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ మంగళవారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఈనెల 27 ఉదయం 9.30కు పట్టణ పార్టీ కార్యాలయం నుంచి శీలం వారి సావరంలో ఉన్న విద్యుత్ శాఖ కార్యాలయం వరకు భారీ ర్యాలీగా వెళ్లి అధికారులకు వినతిపత్రం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్స్, కో ఆప్షన్ సభ్యులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆకట్టుకున్న ఏసుక్రీస్తు చిత్రం



సాధాగర్ రూపొందించిన చిత్రం



ఇందుగమిల్లి సాధాగర్

రాయవరం: ఏసు క్రీస్తు జన్మదినాన్ని క్రిస్మస్‌గా క్రైస్తవ ఆరాధకులు ఆనందంగా జరుపుకునేందుకు ఊరూవాడా సిద్ధమైంది. ఈ నేపథ్యంలో ఏసుక్రీస్తుపై పలువురు పలు రకాలుగా క్రీస్తును స్మరించుకుంటున్నారు. రాయవరం గ్రామానికి చెందిన ఇందుగమిల్లి సాధాగర్ క్రిస్మస్ సందర్భంగా ఇసుక గువ్వరాయిపై ఏసు క్రీస్తు జననం సందర్భాన్ని వాటర్ కలర్స్‌తో రూపొందించిన చిత్రాలు పలువురిని ఆకట్టుకుంది.

వరిలో నారుమడి దశ కీలకం

- విత్తన, నారు నాణ్యతపై వ్యవసాయాధికారుల సూచనలు

కాజులూరు: 'పైరు దృఢంగా పెరగాలంటే విత్తు బలంగా ఉండాలన్నది నానుడి' విత్తనం బలంగా లేకపోతే ఎన్ని ఎరువులు వేసిన పంట ఎదుగుదల, దిగుబడి అంతంత మాత్రంగానే ఉంటుంది. నియోజకవర్గ గ్రామాల్లో రైతులు ప్రస్తుతం దాళ్వా దమ్ములు, నారుమడుల పనుల్లో బిజీగా ఉన్నారు. నారు పోసే ముందే విత్తనాల ఎంపికలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. నియోజకవర్గంలో 52 వేల ఎకరాల్లో వరి సాగవుతుండగా ఈ ఏడాది సుమారు 80 శాతం గ్రామాల్లో రైతులు ఎక్కువగా వెదచల్లిక (నేరుగా వరి విత్తనాలను దదును చేసిన పొలంలో చల్లటం) విధానాలను అవలంబిస్తుండగా అక్కడక్కడా కొందరు రైతులు నాట్లు వేసే విధానాన్ని అవలంబిస్తున్నారన్నారు. నారుమడుల విధానంలో మొలక శాతం తక్కువగా ఉన్నట్లయితే నారు కొరత ఏర్పడుతుంది. వెదచల్లిక విధానంలో మొలక శాతం తక్కువగా ఉన్నట్లయితే వరి మొక్కల మధ్య దూరం పెరిగి మరలా మధ్య, మధ్యలో నాట్లు వేసుకోవలసి వస్తుంది. ఈ సమస్యలను అధిగమించేందుకు విత్తనాల ఎంపికలో రైతులు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు వరి విత్తనాల్లో మొలక శాతాన్ని పరిశీలించి విత్తనాలు చల్లుకోవాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.



కాజులూరులో నాణ్యమైన విత్తనాలతో ఆరోగ్యంగా పెరుగుతున్న వెదచల్లిన వరి పైరు

విత్తనాల నాణ్యతపై పరిశీలన

విత్తనాల నాణ్యతను రైతులు ఈ క్రింది విధంగా పరిశీలించాలని కాజులూరు మండల వ్యవసాయాధికారి వి.అశోక్ సూచించారు. ముందుగా పలుచనిగుడ్డ, లేదా దలసరి టిష్యూ పేపర్‌ని తీసుకుని మడతలు, మడతలుగా వేసి, 100 వరి విత్తన గింజలను తీసుకుని మడతల మధ్య ఉంచి దానిని 24 గంటలు పూర్తిగా నీటిలో నానబెట్టాలన్నారు. తర్వాత పైకి తీసి 24 గంటలు పొడిగా ఉండే గుడ్డ లేదా గడ్డితో కప్పి మండీ కట్టి ఐదు రోజుల తర్వాత మొలక శాతాన్ని లెక్క కట్టాలన్నారు. 80 గింజలు తక్కువ కాకుండా మొలకెత్తినట్లయితే అవి నాణ్యమైనట్టుగా గుర్తించి మొత్తం విత్తనాలను నానబెట్టుకోవచ్చన్నారు. రైతులు మేలైన విత్తనాలను ఎంపిక చేసుకోవడం ద్వారానే పైరు ఆరోగ్యంగా పెరిగి ఆశించిన దిగుబడు సాధించవచ్చన్నారు.

సూర్యఘర్ యోజనతో విద్యుత్ ఆదా

- అర్తమూరులో గ్రామసభ

మండపేట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన ద్వారా రాయితీపై అందిస్తున్న సోలార్ సిస్టం గృహాలకు ఏర్పాటు చేసుకుని విద్యుత్ పొదుపు చేసుకోవాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సూచించారు. మండలంలోని అర్తమూరులో సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ అధ్యక్షతన మంగళవారం సూర్యఘర్ యోజనపై గ్రామసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తన ప్రసంగంలో ఈ పథకంలో గృహాలకు సోలార్ ప్యానెల్స్ వేయించుకున్న వారికి విద్యుత్ ఆదాతో పాటు చార్జీల భారం తగ్గుతుందన్నారు.

ట్రాన్స్‌కో అమలాపురం ఎస్ఈ రాజబాబు మాట్లాడుతూ సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు వల్ల ప్రజలకు ఎంతో లాభదాయకం అన్నారు. మూడు కిలోవాట్ల వరకూ ప్రభుత్వం సబ్సిడీతో సోలార్ సిస్టంను అమర్చనుందన్నారు. సర్పంచ్ అన్నపూర్ణ, మండల మాజీ ఉపాధ్యక్షుడు గొలుగూరి విజయభాస్కరెడ్డి, గ్రామ ప్రముఖులు నల్లమిల్లి వీర్రెడ్డి, పడాల సుబ్బారెడ్డి, తహసీల్దార్ తేజేశ్వరరావు, విద్యుత్ శాఖ అధికారులతో కలిసి ఎమ్మెల్యే పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం తహసీల్దార్ ఆధ్వర్యంలో గ్రామంలో రెవెన్యూ సదస్సు జరిగింది. కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ డీఈ కొల్లి రత్నాలరావు, ఏడీఈ శ్రీధర్, ద్వారపూడి, ఏడిద, ఆలమూరు, మండపేట ఏఈలు రవికుమార్, సాంబశివరావు, ప్రసాద్, ముని, పంచాయతీ కార్యదర్శి అనిల్ కుమార్, గ్రామస్తులు, రెవెన్యూ, విద్యుత్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



అర్తమూరులో సూర్యఘర్ యోజన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

నెలాఖరులోగా బీమా ప్రీమియం చెల్లించాలి

- ఏడీఏ నాగేశ్వరరావు
- నేలటూరులో పొలం పిలుస్తోంది

కపిలేశ్వరపురం: రబీ పంటల బీమా రైతు వాటా 25 శాతం ప్రీమియాన్ని ఈ నెలాఖరులోగా చెల్లించాలని ఆలమూరు సహాయ వ్యవసాయ సంచాలకుడు(ఏడీఏ) కె.నాగేశ్వరరావు తెలిపారు. నేలటూరులో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి కేవీఎన్ రమేష్ కుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో ఏడీఏ నాగేశ్వరరావు పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. రబీ వరి సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులను అవలంబించడం, ఎరువులు, కలుపు యాజమాన్య పద్ధతులు, అధిక దిగుబడి సాధన అంశాలను శాస్త్రీయ పద్ధతిలో వివరించారు. ప్రస్తుత 2024 -25 రబీ సీజన్‌ను సాగు చేస్తున్న రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రంలో ఈ పంట నమోదు, ఈ కేవైసీ చేయించుకోవాలన్నారు. ప్రధానమంత్రి పసల్ బీమా యోజనలో బీమా సదుపాయం కోసం రైతు సొంతంగా 25 శాతం ప్రీమియంగా నెలాఖరులోగా రూ.630 చెల్లించాల్సి ఉందన్నారు. మిగిలిన 75 శాతం ప్రీమియంను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరొక 37.5 శాతం చొప్పున చెల్లిస్తాయన్నారు. సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్ (సీ ఎస్ సీ), మీ సేవ కేంద్రం, పీఏసీఎస్, గ్రామ సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్ వద్ద రైతు స్వయంగా ఎన్‌సీఐపీ వెబ్ సైట్, మొబైల్ యాప్ లలో ఏదొక పద్ధతిలో బీమా నమోదు చేసుకోవచ్చన్నారు. బ్యాంకుల ద్వారా పంట ఋణం పొందిన రైతులు బ్యాంకు ద్వారా ప్రీమియం చెల్లించాలన్నారు.



నేలటూరులో మాట్లాడుతున్న ఏడీఏ నాగేశ్వరరావు

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



పెనుమళ్ళ రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న మండల డీటీ శ్రీనివాసరావు

కాజులూరు: గ్రామాల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) ఎం.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని పెనుమళ్ళలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుల ద్వారా రీ సర్వేలో తలెత్తిన భూ హెచ్చుతగ్గులను సరిచేసుకోవాలన్నారు. మ్యుటేషన్, కుటుంబ సభ్యుల ధృవపత్రాలు, రీ సర్వే రీజన్స్, ఇతర సమస్యలపైన రైతులు ఫిర్యాదు చేసినట్లయితే రెవెన్యూ అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటారన్నారు. ఈ సదస్సులో వివిద సమస్యలపై 19 దరఖాస్తులు అందినట్టు ఆర్ఐ వేగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ మూర్తి, నీటి సంఘం అధ్యక్షుడు పేపకాయల బాబ్జి, మాజీ సర్పంచ్ వనుం వీరబ్రహ్మం, స్థానిక వీఆర్వోలు పట్టాభి, ఉమాదేవి, గ్రామ సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



తాతపూడి రెవెన్యూ సదస్సులో దరఖాస్తును స్వీకరిస్తున్న అధికారులు

పారదర్శకంగా భూ రికార్డుల నిర్వహణ

కపిలేశ్వరపురం: పారదర్శకంగా భూ రికార్డులు నిర్వహించే లక్ష్యంతో గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ చిన్నారావు అన్నారు. తాతపూడిలో ఉన్నతాధికారుల ఆదేశాలపై మంగళవారం తాతాపూడిలో గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ హక్కులపై తలెత్తిన సాంకేతిక సమస్యలను పరిష్కరించమంటూ భూ యజమానుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు జిత్తుగ వెంకటలక్ష్మి, నీటి సంఘం అధ్యక్షుడు మేక శివ ప్రసాద్, గ్రామ నాయకులు వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్యకు నూతన కార్యవర్గం



నూతన మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సూర్యకుమారిని అభినందిస్తున్న సభ్యులు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండల మహిళా సమాఖ్యకు మంగళవారం నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. ఈ మేరకు నిర్వహించిన మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశంలో ముందుగా 2023-24లో వార్షిక నివేదికపై చర్చించారు. అదే విధంగా 2024-25 సంవత్సరానికి ప్రణాళిక తయారు చేశారు. స్త్రీనిధి లోన్లు, సీఐఎఫ్ లోన్లు ఏ గ్రేడు సంఘాలకు ఇవ్వాలని, ప్రతీ గ్రామ సంఘం నుంచి రెండు ప్రొడక్టుల చొప్పున మొత్తం 100 ప్రొడక్టులు ఆన్‌లైన్‌లో ఓఎన్‌జీసీ ద్వారా పెట్టాలని, ఈ ఏడాది 20 గ్రామ సంఘాల్లో గ్రూపు కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా తోటపేటకు చెందిన వెలుగుబంట్ల వీర వెంకట సూర్యకుమారి, కార్యదర్శిగా చోడవరం గ్రామానికి చెందిన కుక్కల సత్యవతి, కోశాధికారిగా యనమదల గ్రామానికి చెందిన రవ్వా లక్ష్మీకుమారిలు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. కార్యక్రమంలో 48 గ్రామ సంఘాల నుంచి అధ్యక్షులు, ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

కాజులూరు: మండల గ్రామాల్లో క్రిస్మస్ సందడి కొనసాగుతుంది. ఈ నెల 25వ తేదీ బుధవారం క్రిస్మస్ పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవులు ముందస్తుగానే క్రిస్మస్ వేడుకలు ప్రారంభించారు. క్రైస్తవులు తమ ఇళ్లపై క్రిస్మస్ స్టార్లను ఏర్పాటు చేయగా పలువురు తమ ఇళ్లను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఇక గ్రామాల్లో చర్చిలైతే మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతులతో దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి. గత వారం రోజులుగా మండలంలో ప్రతి రోజు ఏదో ఒకచోట ప్రత్యేక పార్థనలు, సువార్త కూటములు జరుగుతున్నాయి. వారం క్రితం ఆర్యావటం చర్చిలో ఐక్యక్రిస్మస్ వేడుకలు నిర్వహించగా సోమవారం చేదువాడలో మార్త్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరెక్టర్ డాక్టర్ కె.స్టీవెన్ ఆధ్వర్యంలోనూ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి గుర్తింపు పొందిన పాస్టర్లు వచ్చి బైబిల్ సారాంశాలను, ఏసుక్రీస్తు జన్మరహస్యాలను భక్తులకు వివరిస్తున్నారు. మంగళవారం గొల్లపాలెం కేవీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులు ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించి క్రిస్మస్ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. పలువురు విద్యార్థులు క్రిస్మస్ తాత వేషధారణలో స్థానికులను అలరించారు. క్రిస్మస్ పాటల పోటీలు నిర్వహించి ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. బుధవారం క్రిస్మస్ పురస్కరించుకుని మండలంలోని ప్రతి గ్రామంలోనూ ప్రత్యేక ప్రార్థలను జరుగుతాయని మండల పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు శాంతిలాల్ తెలిపారు. దాదాపు జనవరి ఒకటో తేది వరకూ క్రైస్తవ భక్తులు మండల గ్రామాల్లో క్రిస్మస్ ప్రత్యేక పార్థనలు నిర్వహిస్తారన్నారు.



మండపేట సంఘం కాలనీ స్కూల్లో చిన్నారుల క్రిస్మస్ వేషధారణలు

క్రీస్తు రాకకు వేళాయెనె

రాయవరం: క్రైస్తవులంతా బుధవారం క్రిస్మస్‌ను వేడుకగా నిర్వహించుకోవడానికి సిద్ధమయ్యారు. ఈ నెల ప్రారంభం నుంచే క్రిస్మస్ కేరల్స్, సెమీ క్రిస్మస్ వేడుకలతో సర్వత్రా సందడి నెలకొంది. ఇప్పటికే క్రిస్మస్ చెట్లు, శాంతాక్లాజ్ దుస్తులు మార్కెట్‌ను ముంచెత్తాయి. క్రిస్మస్‌కే ప్రత్యేకమైన శాంతా క్లాజ్(క్రిస్మస్ తాత) చిన్నారులకు బహుమతులు, చాక్లెట్లు, కేక్‌లు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అవి ధరించి చిన్నారులకు కేక్‌లు, మిఠాయిలు, చాక్లెట్లు చిన్నారులకు పంచుతారు. తెల్లవారుజామున కొందరు యువకులు శాంతాక్లజ్ దుస్తుల్లో ఇళ్లకు వెళ్లి బహుమతులు అందజేసేందుకు సిద్ధమయ్యారు. క్రిస్మస్ పండుగ నేపథ్యంలో నక్షత్రాలు క్రిస్మస్ చెట్లతో ఇళ్లు, చర్చిలు మెరిసిపోతున్నాయి.



కాజులూరు చర్చిలో ఏర్పాటు చేసిన క్రీస్తు జనన దృశ్యాల సెట్టింగ్

ముస్తాబైన చర్చిలు

మండలంలోని రాయవరం, లొల్ల, సోమేశ్వరం, మాచవరం, కుర్మాపురం, పసలపూడి, వెదురుపాక తదితర గ్రామాల్లో ఉన్న చర్చిలు క్రిస్మస్‌కు ముస్తాబయ్యాయి. గ్రామాల్లోనిఇ చర్చిలు, ఇళ్ల వద్ద క్రీస్తు రాకకు సూచికగా పెద్ద, పెద్ద నక్షత్రాలను ఏర్పాటు చేశారు. చర్చిలను విద్యుద్దీపాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.



రాయవరంలో చర్చికి ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు

పాఠశాల్లో ముందస్తు క్రిస్మస్

మండపేట: పట్టణంలోని 30వ వార్డు సంఘం కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రిస్మస్ తాత వేషధారణలతో, నూతన వస్త్రాలతో స్కూల్లో సందడి చేశారు. హ్యాపీ క్రిస్మస్ ముగ్గులు వేశారు. పాఠశాల ఉపాధ్యాయులు క్రిస్మస్ పండుగ గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు.